



వైసీపీ పాలనలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంత బరితెగించిపోయారో తెలిపే ఉదంతమిది. ప్రస్తుత సీఎం, నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటి స్థలం సర్వేకు ఏకంగా రూ.2 లక్షలు డిమాండుచేసి మరీ రూ.60 వేలు జేబులో వేసుకున్న డిప్యూటీ సర్వేయర్ సద్దాం హుస్సేన్ సస్పెండు కావడం. ఈ ఘటన నాడు పేట్రేగిపోయిన ఇతర అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఈ ఉదంతం ఇంతటితోనే అంతమవుతుందా? లేక డిప్యూటీ సర్వేయర్‌కుపైన గల అసలు తిమింగలాలు ఏవైనా బయటకు వచ్చే అవకాశం ఉందా అన్న చర్చ ప్రస్తుతం కుప్పంలో నడుస్తోంది. ఎవరి అండా లేకుండానే, ఎవరికీ వాటా ఇవ్వకుండానే డిప్యూటీ సర్వేయరు ఒక్కరే ఏకంగా ప్రతిపక్ష నేత ఇంటి స్థలానికి లంచం ఎలా తీసుకున్నారన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. - కుప్పం



శాంతిపురం మండలం శివపురం వద్ద నిర్మాణంలో ఉన్న చంద్రబాబు ఇల్లు

# బరితెగించారు

**● చంద్రబాబు ఇంటి స్థలం సర్వేకి రూ.60 వేల లంచం ● డిప్యూటీ సర్వేయర్‌పై వేటు ● తిమింగలాల సంగతి ఏమిటో?**

శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం వద్ద కుప్పం-పలమనేరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 5 ఎకరాల స్థలంలో ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణం వేగంగా సాగుతోంది. చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడే ఈ స్థలాన్ని కొన్నారు. సర్వేతోపాటు ఇంటి నిర్మాణ అనుమతులకూ నాటి పీఎంకే ఉడా అధికారులు ముప్పుతిప్పలు పెట్టారు. ఎట్టకేలకు అనుమతినిచ్చారు కానీ, ప్రతి దశలోనూ లంచాలు డిమాండు చేశారన్న వాస్తవం ఇప్పుడు వెలుగు చూస్తోంది. శాంతిపురం మండల పరిధిలో చంద్రబాబు ఇంటి నిర్మాణ స్థలాన్ని సబ్ డివిజన్ చేసి, భూ వినియోగ మార్పిడికోసం అప్పటి మండల డిప్యూటీ సర్వేయర్ సద్దాం హుస్సేన్ ఏకంగా రూ.2 లక్షలు డిమాండు చేసినట్లు ఇటీవల కుప్పం వచ్చిన చంద్రబాబు దృష్టికి టీడీపీ నేతలు తీసుకెళ్లారు. దీనిని కలెక్టర్ సుమిత్‌కుమార్ సీరియస్‌గా తీసుకుని సర్వేశాఖ ఏడీచే రహస్య విచారణ జరిపించారు. ఆరోపణ వాస్తవమని తేలడంతో డిప్యూటీ సర్వేయర్‌ను సోమవారం రాత్రి సస్పెండు చేయడం వంటి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. చంద్రబాబు ఇంటి నిర్మాణానికి ముందు సంబంధిత స్థలాన్ని సర్వే చేయడానికి ఆయన వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ వద్ద డిప్యూటీ సర్వేయర్ సద్దాం హుస్సేన్ రూ.60 వేలు లంచంగా తీసుకున్నది నిజమేనని విచారణలో తేలిందని, అందుకే ఆయన్ను సస్పెండ్ చేశామని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆంధ్రజ్యోతి వద్ద స్పష్టం చేశారు కూడా. ఇప్పుడీ విషయం జిల్లాలోనే కాదు.. రాష్ట్రమంతా హాట్ టాపిక్‌గా మారింది. ఏకంగా ఒక ప్రతిపక్ష నేత, మూడుసార్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రి, మళ్లీ ముఖ్యమంత్రి కాబోయే అవకాశం ఉన్న చంద్రబాబు ఇంటి స్థలం సర్వే చేయడానికే రెవెన్యూ అధికారి లంచం అడగగలిగారంటే.. వైసీపీ అయిదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థ ఎంత కుళ్లిపోయిందో ఇప్పుడు చర్చలోకి వస్తోంది. ఈ విషయం బయటపడ్డాక అందరూ ఔరా అంటూ నోటిమీద వేలేసుకుంటున్నారు.

## వారిమీద చర్యలుండవా?

కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా అవినీతితో చెలరేగిపోయిన రెవెన్యూ అధికారులు, వారికి పైనున్న అధికారుల పాత్రపై లోతైన విచారణ జరిపితే మొత్తం వాస్తవాలు బయటపడే అవకాశముంది. అలా జరగాలంటే జిల్లాస్థాయి అధికారుల నుంచి రైతులకు భరోసా దక్కాలి. అప్పుడే బాధితులైన రైతులు స్వేచ్ఛగా ఫిర్యాదులు చేయగలరు. వీటిపై విచారించి బాధ్యులైన మండలస్థాయి నుంచి ఉన్నత సాయి అధికారుల వరకు చర్యలు తీసుకోవాలని బాధితులైన రైతాంగం కోరుతోంది.

## అవినీతి తిమింగలాల మాటేమిటి?

వైసీపీ ప్రభుత్వంలో అధికార యంత్రాంగం ఎంతగా అవినీతిమయమైందో, ఎంతగా బరితెగించి ప్రజలను పీడించుకు తిన్నారో ఈ ఘటన బహిర్గత పరుస్తుంది. అదే సమయంలో రూ.రెండు లక్షలు లంచం అడగగలిగే ధైర్యం డిప్యూటీ సర్వేయర్‌కు ఎలా వచ్చిందన్న ప్రశ్న ఇక్కడ మిగిలే ఉంది. అప్పట్లో జగన్‌రెడ్డి ప్రభుత్వం సుదీర్ఘకాలం ప్రైవేటు వ్యక్తుల అనుభవంలో ఉన్న డీకేటీ, ప్రభుత్వ భూములకు పట్టాలు ఇస్తామంటూ ఒక పథకం ప్రవేశపెట్టింది. అలాగే భూముల రీసర్వే పేరుతో రెవెన్యూ యంత్రాంగాన్ని గ్రామాల మీదికి వదిలింది. చంద్రబాబు ఇంటి స్థలం సర్వేకు లంచం అడిగిన సమయంలోనే ఈ రెండు పథకాలు అమల్లో ఉన్నాయి. అప్పటి శాంతిపురం తహశీల్దారుగా లోకేశ్వరరావు, ఆర్డీవోగా శివయ్య ఉన్నారు. పలువురు ప్రభుత్వ, డీకేటీ భూములకు పట్టాలు ఇవ్వడం ఏమో కానీ, పలువురి సెటిల్‌మెంట్ భూములు డీకేటీ భూములుగా ఆన్‌లైన్‌కు ఎక్కాయి. రైతులు లబోదిబోమని అధికారులకు మొరపెట్టుకుంటే.. లక్షలాది రూపాయలు చేతులు మారాకే వాటిని తిరిగి సెటిల్‌మెంట్ భూములుగా మార్చారన్న ఆరోపణలు నాటి రెవెన్యూ అధికారులపై ఉన్నాయి. ఇంకా, రీ సర్వేలో ఒక రైతు భూమిని, మరో రైతు భూమిలో కలిపి ఆన్‌లైన్‌కు ఎక్కించడం, ఇద్దరి మధ్యా తగాదాలు సృష్టించి చివరకు లంచం డిమాండ్ చేసి, తిరిగి యథాప్రకారం మార్చడమనే దొంగచాటు వ్యవహారాలు చాలాచోట్ల బహిరంగంగానే సాగాయి. నాడు శాంతిపురం మండలంలో పనిచేసిన రెవెన్యూ యంత్రాంగంలో చాలావరకు రైతులను వేధించుకుని తిన్నారన్న ఆరోపణలున్నాయి. న్యాయంకోసం ఆర్డీవో కార్యాలయానికి వెళ్తే, అప్పటి ఓ ఉద్యోగి.. అక్కడి అధికారి తరఫున లక్షలు డిమాండు చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. అంతెందుకు, తననుంచి రూ.లక్ష లంచం తీసుకున్నాడని డిప్యూటీ సర్వేయర్ సద్దాం హుస్సేన్ మీదే ఒక రైతు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన సస్పెండు వెనుక ఈ ఫిర్యాదు కూడా ఉంది. కేవలం ఒక్క శాంతిపురం మండలానికే ఈ అవినీతి చీడ పరిమితం కాలేదు. మిగిలిన కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండల రెవెన్యూ కార్యాలయాలకూ విస్తరించింది. ఎక్కడా ఫైలు మీద నోట్ల కట్టల బరువు పడందే కదలలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పటి దౌర్జన్యపూరితమైన పాలనకు భయపడి రైతులు గప్‌చుప్‌గా ఉండిపోయారు. ఈ వాటాలు జిల్లా స్థాయి వరకూ పెట్టాలని, అందువల్లే ఎక్కువగా లంచం డిమాండు చేస్తున్నామని మండల స్థాయి రెవెన్యూ ఉద్యోగులు, అధికారులే రైతుల ఎదుట చెప్పిన సందర్భాలు కోకొల్లలు.



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల

## పరిశ్రమల స్థాపనకు చేయూతనివ్వండి: ఎంపీ

చిత్తూరు సిటీ, జూలై 2: పరిశ్రమల స్థాపనకు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. ఢిల్లీలో మంగళవారం ఆయన కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈల స్థాపన, ఆత్మనిర్భర్ పథకాల అమలుకు సహకరించాలని అభ్యర్థించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం తాము రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఢిల్లీలో తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిత్తూరు పార్లమెంటు ప్రజలకు అనేక హామీలు ఇచ్చామని, వాటి అమలుకోసం కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు.

## డిస్కం యాప్‌ల ద్వారానే ఇక విద్యుత్ బిల్లుల చెల్లింపు

చిత్తూరు రూరల్, జూలై 2: ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా ఇకపై కరెంటు బిల్లులు చెల్లించరాదు. జూలై నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించ కూడదని ఆర్‌బీఐ నిబంధనలు పెట్టింది. అలాగని, బిల్లుల చెల్లింపునకు విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లనవసరం లేదు. ఎస్‌పీడీసీఎల్ వినియోగదారులు గూగుల్ ప్లేస్టోర్ లోని సదరన్ పవర్ యాప్ లేదా apspdcl.in ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఆ శాఖ తెలిపింది. నేరుగా సదరన్ పవర్ యాప్, వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తర్వాత ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం యూపీఐ యాప్‌లు వినియోగించి బిల్లులు చెల్లించవచ్చునని పేర్కొంది. డెబిట్, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్ క్యాష్ కార్డుల ద్వారా కూడా బిల్లులు చెల్లించే అవకాశం ఉందని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు.

## పరిమితికి మించి కందిపప్పు నిల్వ ఉంచొద్దు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 2: జిల్లాలో కంది, శనగపప్పు నిల్వలు పెంచి కృత్రిమ కొరత సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై కొరడా ఝుళిపించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం వ్యాపారుల వద్ద స్టాక్ నిల్వలు ఉండాలి. ఆ మేర ప్రతిరోజూ నిల్వల వివరాలను బోర్డుల్లో నమోదుచేయాలి. కొందరు వ్యాపారులు దీనిని విస్మరించి.. పప్పు దినుసులను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం 9 నెలలుగా కార్డుదారులకు కందిపప్పు పంపిణీ నిలిపేసింది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధరలు పెరగడానికి ఇదీ కారణమైంది. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కిలో రూ.175 నుంచి రూ.200 మధ్య ధర ఉంది. ధరల నియంత్రణ, కృత్రిమ కొరతపై అప్పటి ప్రభుత్వం దృష్టి సారించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో వ్యాపారుల వద్ద నిల్వలపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టింది.

**ఇంతకు మించొద్దు :** 'కందిపప్పు, శనగపప్పు వంటి పప్పు దినుసుల నిల్వల వివరాలను వ్యాపారులు వినియోగదారుల వ్యవహారాల శాఖ జీఐవో పోర్టల్ fcainfoweb.nic.in లో నమోదు చేయాలి. ఈనెల 12వ తేదీలోగా నిర్దేశించిన పరిమితులకు లోబడి పప్పుధాన్యాల స్టాకు క్రమం తప్పకుండా జీఐవో పోర్టల్‌లో నమోదు చేయాలి. ఆ తర్వాత స్టాకు పరిమితులు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం' అని జేసీ శ్రీనివాసులు స్పష్టంచేశారు.

**స్టాకు ఉండాల్సింది ఇంతే**

**టోకు వ్యాపారి:** 200 టన్నులు
**రిటైలర్:** 5 టన్నులు
**పెద్ద చైన్ రిటైలర్:** 5 టన్నులు
**డిపోల్లో:** 200 టన్నులు
**దిగుమతిదారులు :** కస్టమ్స్ క్లియరెన్స్ తేది నుంచి 45 రోజులకు మించి దిగుమతి చేసుకున్న స్టాకును కలిగి ఉండరాదు.

### రైతుబజారులో రూ.165కే కందిపప్పు


చిత్తూరు (సెంట్రల్), జూలై 2: రైతు బజారులో కిలో రూ.165 చొప్పున కందిపప్పు విక్రయించనున్నారు. ఈ విక్రయ కేంద్రాన్ని మంగళవారం చిత్తూరు రైతు బజారులో జేసీ శ్రీనివాసులు ప్రారంభించారు. ఇక్కడితో పాటు బజారు వీధిలోని వినాయక స్టోరులోనూ ఇదే ధరకు విక్రయిస్తున్నట్లు జేసీ చెప్పారు. మార్కెట్‌లో ధరలు గణనీయంగా పెరగడంతో రైతుబజార్ల ద్వారా సామాన్యులకు తక్కువ ధరకు కందిపప్పు విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. కందిపప్పు ఉత్పత్తి, సరఫరా తగ్గిపోవడంతో ధరలు పెరిగాయన్నారు. మొబైల్ వాహనాల ద్వారా టమోటాలనూ తక్కువ ధరకు అందుబాటులోకి తెచ్చామన్నారు. చిరు వ్యాపారులకోసం రైతు బజారులో ఉచితంగా స్థలం కేటాయించనున్నట్లు తెలిపారు. రోడ్లపై అమ్మకాలు జరిపే వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ ధరల కంటే రైతు బజార్లో తక్కువ ధరకే విక్రయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అనంతరం రూ.165కే కిలో కందిపప్పు కొనుగోలుదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్వో శంకరన్, ఏడీ మార్కెటింగ్ పరమేశ్వరన్, తహసీల్దారు శ్రీనివాసుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రైతు బజారులో కంది పప్పును విక్రయదారులకు అందిస్తున్న జేసీ శ్రీనివాసులు

## మీ డబ్బులు తీసుకోండి నా పేరు చెప్పకండి

**● ఉద్యోగాలిప్పిస్తానని తీసుకున్న డబ్బు వాపస్ ఇచ్చిన వైసీపీ నేత**



పుంగనూరు, జూలై 2: 'ఉద్యోగం కోసం మీరు ఇచ్చిన డబ్బులు తీసుకుని వెళ్లండి. ఎక్కడా నాపేరు మాత్రం చెప్పొద్దు' అంటూ పుంగనూరులో ఓ ప్రముఖ వైసీపీ నేత డబ్బులు వాపసు ఇచ్చిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. 15 సంవత్సరాలుగా పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, 10ఏళ్లుగా రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కొనసాగుతూ వైసీపీ ప్రభుత్వంలో వీరు కీలకంగా వ్యవహరించారు. ఈ క్రమంలో పుంగనూరులో పలువురు వైసీపీ నేతలు అందినకాడికి వివిధ రకాలుగా దండుకున్నారు. పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, నామినేటెడ్ పదవిలో కొనసాగుతూ పట్టణంలో ప్రముఖ నాయకుడిగా వ్యవహరించే వ్యక్తి పలువురి వద్ద ఉద్యోగాల పేరుతో రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారు. పుంగనూరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు, వివిధ విధుల నిర్వహణ, విద్యాశాఖలో మరికొందరికి కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేయించడానికి డబ్బులు తీసుకున్నారు. కొంతమందిని ఉద్యోగాల్లో చేర్చగా మరికొందరు ఉద్యోగాల కోసం తిరుగుతున్నారని తెలిసింది. ఈ ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం పొంది, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపీ ఓడిపోవడం, ఎమ్మెల్యే, ఎంపీలుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గెలుపొందినా ఒక్కసారి కూడా పుంగనూరుకు రాలేకపోవడం, వారు వస్తే టీడీపీ శ్రేణులు అడ్డుకుంటామని ఆందోళనలకు దిగడం జరుగుతోంది. గతంలో విచ్చలవిడిగా అతిగా ప్రవర్తించి టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టిన వైసీపీ నాయకుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకుని సంవత్సరాలు గడిపిన వైసీపీ నేత సోమవారం రాత్రి పలువురి బాధితులను ఇంటికి పిలిచి తమ ప్రభుత్వం లేదని, మీవద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తున్నానని, ఈవిషయం ఎవరికీ చెప్పొద్దని కోరారు. ప్రస్తుత పరిస్థితిలో ఎక్కడైనా పోలీసులకు ఫిర్యాదు చేసినా, తెలుగుదేశం పార్టీ నేతలకు తెలిస్తే తప్పకుండా కేసుపెట్టి అరెస్టు చేయిస్తారన్న ఆందోళనలో ఆయన ఉన్నట్లు తెలిసింది. అందుకే డబ్బులు తిరిగి ఇచ్చేశారు. అయినా, ఈ ఘటనపై మంగళవారం పట్టణంలో విస్తృతంగా చర్చ సాగింది. ఇదే తరహాలో అక్రమంగా డబ్బులు వసూళ్లు చేసి ఇబ్బందులు పెట్టిన వైసీపీ శ్రేణులు భయాందోళనలో ఉన్నారు.

## పింఛన్ల పంపిణీ పూర్తి

చిత్తూరు (సెంట్రల్), జూలై 2: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజైన మంగళవారానికి పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా 2,71,696 మందికి గాను తొలి రోజైన సోమవారం 2,54,714 మందికి పింఛన్లు అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మంగళవారం అందజేసి పింఛన్ల పంపిణీని పూర్తి చేశారు.

## బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

కలికిరి, జూలై 2: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు మంగళవారం కలికిరి బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కూడిన కమిటీ అర్హులైన విద్యార్థులను పారదర్శక పద్ధతిలో ఎంపిక చేసింది. గత వారం మిగులు సీట్ల భర్తీ కోసం జిల్లా స్థాయిలో కలికిరి గురుకుల పాఠశాలలో అర్హత పరీక్షలు నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులను 1:2 నిష్పత్తిలో కౌన్సెలింగ్ కోసం ఎంపిక చేశారు. మంగళవారం బాలురకు మాత్రం కౌన్సిలింగ్‌ను పరిమితం చేశారు. బుధవారం బాలికల సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సదుం, సత్యవేడు, ఐతేపల్లె, తంబళ్లపల్లె (అంగళ్ళు), కుప్పం పాఠశాలల్లో 6వ తరగతిలో అందుబాటులో ఉన్న 51 సీట్లు, 7వ తరగతిలో 20 సీట్లు, 8వ తరగతిలో 36 సీట్లు, 9వ తరగతిలో 51 సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేశారు. మొదట విద్యార్థులతో పాటు హాజరైన తల్లిదండ్రులకు సీట్ల ఎంపిక విధానాన్ని గురించి కన్వీనరు, కలికిరి పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ అవగాహన కల్పించారు. కౌన్సిలింగ్ నిర్వహణలో సదుం, ఐతేపల్లె, సత్యవేడు, తంబళ్లపల్లె, కుప్పం, కలికిరి పాఠశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు రెడ్డి, దేవి సులోచన, శ్రీనివాసులు, రామాంజనేయ రెడ్డి, సరోజ, సోమశేఖర్ పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్న సోమశేఖర్

## పలమనేరులో వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన రూ.62.8 కోట్ల పనులు మళ్లీ మంజూరు

పలమనేరు, జూలై 2: పలమనేరు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన రూ.62.80 కోట్లకు పైగా విలువ చేసే అభివృద్ధి పనులను తిరిగి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో మంత్రిగా ఉన్న అమరనాథరెడ్డి నియోజకవర్గానికి రూ.60 కోట్ల విలువ చేసే పనులను మంజూరు చేయించారు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పలమనేరు ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడ గెలుపొందారు. దీంతో అమరనాథరెడ్డి మంజూరు చేసిన పనులన్నింటిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పాటు పలమనేరు ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి గెలిచారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి గత నెల చివర్లో కుప్పానికి వచ్చిన చంద్రబాబునాయుడిని అమర్‌ను కలిశారు. పలమనేరు నియోజకవర్గానికి మంజూరై.. వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన పనులను తిరిగి మంజూరుచేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఎం.. ఆ పనులన్నింటిని మళ్లీ మంజూరు చేశారు. దీంతో పలమనేరు నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీనాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ మంజూరు చేసిన పనుల్లో.. వి.కోటలో బాలికల రెసిడెన్షియల్ ఉర్దూ కళాశాల, కమ్యూనిటీ హాలు, పలమనేరులో కమ్యూనిటీ హాలు, షాదీమహళ్ల మరమ్మతులు, వి.కోటలో అంబేడ్కర్ భవన్ నిర్మాణం, పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లెలో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, వి.కోటలో ప్రభుత్వ డిగ్రీకళాశాల, శీతల గిడ్డంగి, గోడౌన్ల నిర్మాణం, బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ జలపాతం వద్ద రిజర్వాయర్ నిర్మాణం, కౌండిన్య నదిపై 16 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, రాయలపేట నుంచి మాదవరం వరకు అర్ధంతరంగా ఆగిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తిచేసేందుకు నిధులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 14 బీసీ కమ్యూనిటీ భవనాలు నిర్మాణం, పలమనేరులో కాపు భవనం నిర్మాణ పనులున్నాయి.

# పింఛనుకోసం వైకల్యం!

**● తప్పుడు ధ్రువపత్రంతో వైసీపీ నేతకు పింఛను**

చిత్తూరు సిటీ, జూలై 2: ఆయన నడవగలరు. కానీ, 45శాతం వికలత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ పొందారు. పింఛను తీసుకొంటున్నారు. మూడు చక్రాల వాహనమూ మంజూరైంది. ఆయన వైసీపీ నేత కావడంతో గత ప్రభుత్వంలో ఇదంతా జరిగిపోయింది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారం మారాక ఈ విషయం వెలుగు చూసింది. చిత్తూరు పట్టణంలోని ఈ ఘటనకు సంబంధించి స్థానికులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నగరం 20వ డివిజన్ కాజూరు వైసీపీ ఇన్‌చార్జి మహేష్‌బాబు (కాజూరు సుబ్బ) ఈ ఏడాది జనవరి నుంచి విభిన్న ప్రతిభావంతుల కోటాలో రూ.3 వేల పింఛను తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని 45 శాతం వైకల్యం ఉన్నట్లు తప్పుడు ధ్రువపత్రం పొందారని ఆరోపణలున్నాయి. తాజాగా ఈనెల టీడీపీ ప్రభుత్వం పెంచి ఇచ్చిన రూ.6 వేల పింఛనూ పొందారు. ఇక, గత వైసీపీ ప్రభుత్వంలో ఆయనకు రూ.1.25 లక్షల విలువచేసే మూడు చక్రాల యాక్టివా వాహనం కూడా మంజూరైంది. అసలు విషయం ఏమంటే.. ఆయనకు వైకల్యం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సచివాలయ ఉద్యోగులను ప్రశ్నిస్తే సర్టిఫికెట్ ఉంది కాబట్టి ఇస్తున్నామని చెప్పారంటూ స్థానికులు తెలిపారు. ఈయనకు ప్రతినెలా రూ.వేలల్లో ఇంటి అద్దెలు కూడా వస్తున్నాయని ఫిర్యాదు చేశారు.



మహేష్ బాబు (ఫైల్‌ఫొటో)

## క్వారీలు, మైనింగ్ కార్యకలాపాలపై తనిఖీలకు కమిటీల ఏర్పాటు

**● 10లోగా నివేదిక ఇవ్వాలి**

చిత్తూరు కలెక్టరేట్, జూలై 2: జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న క్వారీలు, మైనింగ్ కార్యక్రమాలపై తాజా పరిస్థితి అంచనా వేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు మండలాల్లో ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలపై ఈనెల 10లోగా జేసీ శ్రీనివాసులుకు నివేదిక ఇవ్వాలని సూచించారు. వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక పంపాల్సి ఉందన్నారు. ఈ మంగళవారం ఆయన అధికారులతో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి దశ, దిశ నిర్దేశించారు. మండలాల్లోని లైసెన్స్‌డ్ క్వారీలు, అనుమతులు లేకుండా కొనసాగుతున్న అన్‌లైసెన్స్‌డ్ క్వారీలు, మైనింగ్‌లలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై ఈ కమిటీలు క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఉన్నదిఉన్నట్లు నివేదికలు ఇవ్వాలని స్పష్టంచేశారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన మండలస్థాయి కమిటీలో స్థానిక తహసీల్దార్ అధ్యక్షతన మైనింగ్, క్వారీలు, పంచాయతీరాజ్, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో, సర్వేశాఖ ప్రతినిధులు ఉంటారు. డీఆర్వో చైర్మన్‌గా వ్యవహరించే జిల్లాస్థాయి కమిటీలో మైనింగ్‌శాఖ డీడీ, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ ఈఎస్, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్, సర్వేశాఖ డీడీ తదితరులు సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయి కమిటీ బృందం ర్యాండమ్ తనిఖీలను మండలాల్లో చేయాలి. ఆ తర్వాత తమ తనిఖీ నివేదికలను ఈనెల 10లోగా జేసీకి అందజేయాలి.

## అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య

బంగారుపాళ్యం, జూలై 2: అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం దండువారిపల్లెకు చెందిన కరుణాకర్, ఉమ దంపతుల కుమార్తె హిందూప్రియకు నాలుగేళ్ల క్రితం అదే మండలం కీరమంద పంచాయతీ వేపనపల్లికి చెందిన రంగనాథన్, కుమారి దంపతుల కుమారుడు మణికంఠతో వాఆహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలంగా భర్త, అత్త, మణికంఠ అక్కలు ధనలక్ష్మి, మీనాక్షి నిత్యం కట్నం కోసం వేధించేవారు. భర్త కొట్టేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన హిందూప్రియ (26) మంగళవారం వేపనపల్లిలోని ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అత్త కుమారి, భర్త మణికంఠ, ఆడపడుచులు ధనలక్ష్మి, మీనాక్షిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న హిందూప్రియ

## జూన్‌లో అధిక వర్షపాతం నమోదు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 2: జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్‌లో అధిక వర్షాలు కురిశాయి. ఈ నెలల 80.8 మి.మీ. సాధారణ వర్షపాతానికి గాను 188.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. 30 మండలాల్లో అత్యధికంగా, వి.కోటలో 91.1 మి.మీకి 101.2, వెదురుకుప్పంలో 101 మిమీకి 121 మిమీ వర్షపాతం నమోదయ్యింది. గత నెల మిగులు వర్షం వల్ల అనేక ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ నెలలో సాధారణ వర్షపాతం 103.9 మి.మీ. కాగా గడచిన 24 గంటల్లో ఏడు మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. మండలాలవారీగా విజయపురంలో 10.6, తవణంపల్లెలో 6.4, నింద్రలో 6.2, శ్రీరంగరాజపురంలో 6.2, కార్వేటినగరంలో 3.8, పూతలపట్టులో 3.2, నగరిలో 2.0 మి.మీ .వర్షపాతం నమోదయ్యింది.

## పాతకక్షలతో టీడీపీ నాయకుడిపై దాడి

గంగవరం, జూలై2: పాత కక్షలతో జరిగిన ఘర్షణలో టీడీపీ నాయకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డి గ్రామంలో వెళ్తుండగా, ప్రత్యర్థి వర్గానికి చెందిన దనకొండ, సుబ్రమణ్యం మండడిలు ఆయనపై దాడిచేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా గాయపడిన సుబ్రమణ్యం రెడ్డిని టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన సుబ్రమణ్యం రెడ్డి

## అదుపుతప్పి మినీ లారీ బోల్తా

గంగాధరనెల్లూరు, జూలై 2: చిత్తూరు - పుత్తూరు రహదారి గంగాధరనెల్లూరు వద్ద మంగళవారం మినీ లారీ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు చెన్నై నుంచి మంగళూరుకు గ్లాస్(అద్దాలు)లోడ్‌తో వ్యాన్ బయలుదేరింది. గంగాధరనెల్లూరు దళితవాడ దగ్గర ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. వాహన చోదకుడికి గాయాలయ్యాయి. అతడిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఐచర్ వ్యానును ఆపకుండా డ్రయివర్ వేగంగా పోనిచ్చాడు. ఈక్రమంలో వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొట్టి అదుపుతప్పి బోల్తాపడింది. లారీలోని అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వ్యాన్‌లో ఎవరికీ గాయాలు తగలలేదని పోలీసులు చెప్పారు.



అద్దాల లోడ్‌తో బోల్తాపడిన వ్యాన్

## మార్కెట్లోకి ఫోర్స్ బస్సులు



తేజోమూర్తికి బస్సు తాళాలు అందజేస్తున్న శివప్రసాద్

రేణిగుంట, జూలై 2: తిరుపతి- రేణిగుంట రోడ్డులోని శ్రీ దుర్గా ఫోర్స్ షోరూమ్‌లో మంగళవారం ఫోర్స్ స్కూల్ బస్సులను మార్కెట్లోకి విడుదల చేశారు. వీటిని చిత్తూరుకు చెందిన విజయం గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత తేజోమూర్తి మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్, ఫోర్స్ ఏరియా సేల్స్ మేనేజర్ కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ నుంచి 55 సీట్ల కెపాసిటీతో స్కూల్ బస్సులను విడుదల చేశామన్నారు. మోనోకోక్ బాడీతో ఉన్నతమైన పారాబోలిక్ సస్పెన్షన్‌తో ప్యాసింజర్లకు కారులో తిరిగే అనుభూతితో మంచి మైలేజి కలిగి ఉండటం ఈ బస్సుల ప్రత్యేకత అని చెప్పారు.

## కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

గుడుపల్లె, జూలై 2: 'కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగినా తగ్గలేదు. ఈ క్రమంలో మా సోదరుడు కేశవ (23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు' అంటూ పోలీసులకు ఆయన అన్న ఫిర్యాదు చేశారు. గుడుపల్లె మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండలంలోని అయ్యవార్ల గొల్లపల్లెకు చెందిన వెంకటేష్, ప్రమీల దంపతులకు కార్తీక్(25), కేశవ(23) కుమారులు. కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట వెంకటేష్ మృతిచెందారు. కొన్ని సంవత్సరాలుగా కేశవ కడుపునొప్పితో బాధపడేవాడు. ఎన్నో ఆస్పత్రులకు వెళ్లినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం చింతతోపు సమీపంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడతుఉన్న ఇతడిని అటుగా వెళ్తున్న గ్రామస్థులు గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. వెంటనే కేశవను పీఈఎస్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాత్రికి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కేశవ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి అన్న కార్తీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి కుప్పం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.



మృతుడు కేశవ (ఫైల్ ఫొటో)

సాగు భూములకు నీరందించే తీగలమ్మ చెరువు మొరవను జే న్యూటౌన్ వెంచర్ ఆక్రమణలతో మింగేసింది. గత ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి అండతో ఈ నిర్వాకం చోటు చేసుకుంది. ఈ వెంచర్ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిది. నిర్వాహకులు చేసిన పనులకంతా అధికారులు 'రైట్' అని చెప్పడం తప్ప.. ఎక్కడా అడ్డుకున్న పాపాన పోలేదు. - పుంగనూరు

# మొరవను మింగేశారు

**● పెద్దిరెడ్డి అండతో జే న్యూటౌన్ వెంచర్ నిర్వాకం**

**● తీగలమ్మచెరువు నుంచి నీళ్లు పోవాలంటే ఇబ్బందికరం**



తీగలమ్మ చెరువు

పుంగనూరులో ఇరుకురోడ్లు వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. అందుకని రెండేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం మదనపల్లె రోడ్డులోని భీమగానిపల్లె నుంచి పలమనేరు రోడ్డు అరబ్బిక్ కాలేజీ వరకు బైపాస్‌రోడ్డు నిర్మించింది. దీంతో బైపాస్ రోడ్డులోని భూములకు విలువ పెరిగింది. పలువురి పొలాలు వెంచర్లుగా వరాఆయి. కొందరు వ్యవసాయేతర భూములుగా మార్పు చేయకుండా, ప్రభుత్వానికి స్థలం వదలకుండా, మరికొందరు చలాన్లు కూడా కట్టకుండా, అనుమతులు లేకుండా వెంచర్లు వేసేశారు. ఎవరైనా అడిగితే మా మంత్రి పెద్దిరెడ్డి చెప్పారనేవారు. అదే సమయంలో పుంగనూరు నుంచి రాయలపేట, నెక్కొంది, చౌడేపల్లె వేళ్లే మార్గంలో పట్టణానికి సమీపంలో బైపాస్‌రోడ్డు పక్కనే పుంగనూరు మాజీ ఎమ్మెల్యే ఎన్.శ్రీధర్‌రెడ్డి, ఆయన తల్లికి చెందిన పొలం ఉంది. అక్కడే జే న్యూటౌన్ పేరిట వెంచర్ వేశారు. ఈయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడు. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పేరుతో ఏతూరు గ్రామంలోని సర్వేనెంబరు100/3, 101/1, 83/2, 85/2, 85/3, 85/4ల్లో 4.45 ఎకరాలు.. ఆయన తల్లి ఎస్.ఎల్లమ్మరెడ్డి పేరుతో సర్వేనెంబర్లు 84/1, 86/2, 85/1, 88, 84/2, 86/1, 87/2, 84/3ల్లో 32.44 ఎకరాలు చొప్పున మొత్తం 36.89 ఎకరాలున్నాయి. అలాగే జేన్యూటౌన్‌లో తమ భూములున్నాయని పుంగనూరు కోర్టులో కొందరు రెండు కేసులు దాఖలు చేశారు. దాదాపు 60.71 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ వేశారు. దీని పక్కనే తీగలమ్మచెరువు నిండితే వరదనీరు ప్రవహించడానికి పూర్వం నుంచి మొరవ ఉండేది. ఈ వెంచర్ మధ్యలో మొరవ వెళుతుండటంతో తమ ప్లాట్లకు ఇబ్బందిగా ఉంటుందని నాటి ప్రభుత్వ పెద్దల సహకారంతో పెద్ద మొరవను మూడు సిమెంట్ పైపులుపెట్టి కాల్వగా మార్చి ఆక్రమించారు. వెంచర్‌లోపల కూడా పైపులు పెట్టి పైన మట్టితో పూడ్చారు. భారీ వర్షాలు వస్తే వరదనీరు ఉధృతంగా వెళ్లే అవకాశం లేకుండా కుదించేశారు. పుంగనూరుకు ఇప్పటికి రెండుమార్లు వరదలు వచ్చిన విషయం తెలిసిందే. మొరవ ఆక్రమించినా ఏ అధికారి అడ్డుకున్న దాఖలాలు లేవు.







### పంచాయతీ కరెంటూ వాడేశారు!

ఈ వెంచర్ కోసం ఏతూరు గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా ఈఏడాది ఫిబ్రవరిలో కరెంట్ సర్వీసు తీసుకొని వాడుకున్నారు. వీధిదీపాలు, వాటర్‌వర్క్స్ అవసరాలకు ఉపయోగించకుండా సర్వీసు నెంబరు 5811502003578లో గత నెల వరకు 976 యూనిట్ల కరెంటును వినియోగించారు. కరెంట్ బిల్లు రూ.41,077, ఎసీడీ చార్జి రూ.26,910 బకాయి ఉంది. కరెంట్ తీసుకున్నప్పటినుంచి పైసా కూడా చెల్లించలేదు. బైపాస్‌రోడ్డుకు మూడుమీటర్లలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పక్కనే ఉన్న కల్వర్టు కింద కేబుల్ తీసుకెళ్లి జేన్యూటౌన్‌కు కరెంట్ ఇవ్వడం వల్ల రోడ్డుప్రమాదాలు జరుగుతాయని గత నెలలో కొందరు స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో పంచాయతీ కరెంటు వాడుతున్న విషయం బయటపడుతుందని గ్రహించి ఆ విద్యుత్ కనెక్షన్‌ను సిబ్బంది తొలగించారు. ప్రస్తుతం మీటరు ఖాళీగా ఉంది. వెంచర్‌లో విద్యుత్ శాఖకు సంబంధించి అనేక ఉల్లంఘనలు, అక్రమాలు జరిగాయని ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదులు పంపినట్లు తెలిసింది.

### బ్యూటిఫికేషన్ కోసం ఎన్‌హెచ్ ఆక్రమణ

జేన్యూటౌన్ వెంచర్ కోసం బైపాస్‌రోడ్డులోని జాతీయ రహదారిని ఆక్రమించి గ్రీనరీ, మొక్కలు, పూలమొక్కలు నాటి బ్యూటిఫికేషన్ పనులు చేశారు. ఎన్‌హెచ్ రోడ్డు రెండువైపులా విద్యుత్ స్తంభాలు హద్దులుగా ఉండగా వెంచర్ వరకు మాత్రం సగం స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించినా అధికారులు పట్టించుకోలేదు. బయట ప్రాంతాల నుంచి పదేళ్లకు పైబడిన చెట్లను వేర్లతో పాటు ప్రత్యేకంగా వాహనాల్లో తీసుకొచ్చి వెంచర్ ముందు, లోపల నాటారు. వైసీపీ అధికారంలో ఉండటంతో అడ్డుఅదుపులేకుండా నిబంధనలు తుంగలో తొక్కారన్న ఆరోపణలున్నాయి. ఇప్పుడు ఇవన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వీటిపై సమగ్రంగా విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు.



# కొత్త చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి

**గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి ● నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఆదేశం**

చిత్తూరు, జూలై 2: కొత్త చట్టాలను ప్రతి పోలీసు స్టేషన్‌లో అమలు చేయడంతో పాటు ప్రజలందరికీ అవగాహన కల్పించేలా అవగాహన సదస్సులను నిర్వహించాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో మంగళవారం ఆయన డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులతో పాటు మర్డర్, డెకాయిట్, రాబరీ, ప్రాపర్టీ, వాహనాల దొంగతనాలు కేసులు, మిస్సింగ్ కేసులు, చీటింగ్, సైబర్ నేరాలు తదితర కేసులపై సమీక్షించారు. కేసుల ఛేదింపులు, పరిష్కారం, నేర నియంత్రణకు పలు సూచనలను చేశారు. కేసు నమోదైన తరువాత కోర్టులో నిందితులకు శిక్షణ పడేటట్లు చేస్తే బాధితులకు న్యాయం చేసిన వాళ్లమవుతామన్నారు. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు సాంకేతికతను వినియోగించి నిందితులను త్వరగా పట్టుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. ప్రాపర్టీ నేరస్తులు, పాత నేరస్థులపై గట్టి నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణా నిందితులపై ఉక్కుపాదం మోపాలన్నారు. డ్రగ్స్‌తో అనర్థాలపైనా అవగాహన కల్పించాలన్నారు. రాత్రి, పగలు బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. 2024 ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు అరీఫుల్లా, సుబ్బారావు, మూడు డివిజన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ మణికంఠ

## గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

సత్యవేడు, జూలై 2: గంజాయి కేసులో సత్యవేడు పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కిలో గంజాయి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని శ్రీకాళహస్తి మార్గంలో కాళమనాయుడుపేట వద్ద మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులను పోలీసు సిబ్బంది ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా బైక్‌ట్యాంక్ కవరులో గంజాయి బయటపడింది. ద్విచక్ర వాహనంతో పాటు ఇద్దరు యువకులను అదుపులో తీసుకుని విచారించగా సత్యవేడు గంగమిట్ట వీధికి చెందిన కుమార్(25), దళితవాడకు చెందిన కాశీయప్ప(22)గా తెలిసింది. వారు వారు గంజాయి అమ్ముతున్నట్లు విచారణలో తేలడంతో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.ఐదువేలు, ద్విచక్ర వాహనం విలువ రూ. 50 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిందితులు సూళ్లూరుపేటలో గంజాయి కొనుగోలు చేసుకుని సత్యవేడు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులు ఉదయమే పట్టుబడ్డా పొద్దుపోయే వరకు సంబంధిత వివరాలను మీడియాకు వెల్లడించకుండా పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు దారితీసింది. ఈ విషయమై సీఐ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా నిందితుల విచారణ, కేసు నమోదు తదితర ప్రొసీజర్ ఆలస్యం కావడంతో ప్రెస్‌మీట్ పెట్టలేకపోయామని ఆయన చెప్పడం కొసమెరుపు.

## సౌత్‌జోన్ రెజ్లింగ్ టోర్నీలో హర్షిత ప్రతిభ

తిరుపతి (క్రీడలు), జూలై 2: తమిళనాడు మిట్టూరుద్యాం జిల్లాలో జరిగిన సౌత్‌జోన్ అండర్ 23 రెజ్లింగ్ టోర్నీలో వెదురుకుప్పం మాంబేడు గ్రామానికి చెందిన కొణిదల హర్షిత ప్రతిభ కనబరిచింది. 57కిలోల విభాగంలో కాంస్యం, మట్టికుస్తీ విభాగంలో రజత పతకాలు సాధించింది. ఈమె శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆరు నెలలుగా శాప్ రెజ్లింగ్ శిక్షకురాలు హిందూజ వద్ద శిక్షణ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీనివాస క్రీడాసముదాయంలో క్రీడాకాధికారి సయ్యద్‌సాహేబ్ ఆధ్వర్యంలో హర్షితను సత్కరించారు. ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోచ్ ప్రేమనాథ్, రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# దొంగల ముఠా అరెస్టు

రేణిగుంట, జూలై 2: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక బంగారు చైను స్వాధీనం చేసుకున్నట్లు రేణిగుంట సీఐ మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామా నగర్‌లో పోలీసులు గాలింపు చేపట్టారు. పోలీసులను గమనించిన కొంతమంది పారిపోయేందుకు యత్నించగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా తిరుపతి మారుతీనగర్‌కు చెందిన జశ్వంత్, సంజీవనగర్‌కు చెందిన సతీష్, కోలా వీధికి చెందిన జశ్వంత్, ప్రసన్నకుమార్, భవానీనగర్‌కు చెందిన వేముల చరణ్, రఘునాథ్‌రెడ్డి కాలనీకి చెందిన రియాజ్, పాకాలకు చెందిన దిలీప్‌గా తెలిసింది. ఇది వరకే వీరిపై తమిళనాడు తిరువల్లూరు, తిరుచానూరు, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి దోపిడీ, చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ల చోరీ కేసులు కేసు నమోదైనట్లు తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, రైటర్ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



దొంగల ముఠాను అరెస్టు చూపుతున్న సీఐ మల్లికార్జున్

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు

## అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు, జూలై 2: పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల సూపర్‌వైజర్ విజయలక్ష్మీ తెలియజేశారు. పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీ ఆర్.కుమ్మరపల్లి మినీ అంగన్వాడీ కార్యకర్త (ఓసీ), కావేటిగారిపల్లి పంచాయతీ వీసీ వడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రం సహాయకురాలు (బీసీ-ఏ), రొంపిచెర్ల మండలం బోడిపాటివారిపల్లి అంగన్వాడీ కేంద్రం సహాయకురాలు (బీసీ-బి), బొమ్మయ్యగారిపల్లి పంచాయతీ ఫజుల్‌పేట అంగన్వాడీ కేంద్రం సహాయకురాలు (ఓసీ), సదుం మండలం బూరగమంద అంగన్వాడీ కేంద్రం సహాయకురాలు (ఓసీ), పాలమంద పంచాయతీ పొలికిమాకులపల్లి అంగన్వాడీ కేంద్రం సహాయకురాలు (బీసీ-ఏ) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసుకునే వారు అంగన్వాడీ కేంద్రం పరిధిలో స్థానిక వివాహితురాలై, పది పాసై, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని వివరించారు. ఈ నెల 4వ తేదీ నుంచి 19వ తేదీలోగా పులిచెర్ల సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

**కుప్పం:** కుప్పం నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కుప్పం ఐసీడీఎస్ సీడీపీవో ఒక ప్రకటనలో తెలిపారు. గుడుపల్లె మండలం కనమనమపల్లె, బిసానత్తంలలో అంగన్వాడీ కార్యకర్తలు, కుప్పం మండలం అడివి బూదుగూరు, రాగిమానుమిట్ట, వెండుగంపల్లె, గుడుపల్లె మండలం తిమ్మనాయనిపల్లె, బిసానత్తంలలో ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

**పుంగనూరు రూరల్:** పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు అధికారిణి రాజేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పుంగ నూరు మండలం కొండందొడ్డి, ఏతూరు, బోడేవారిపల్లె, రాంపల్లె ప్రాంతాల్లోని మినీ అంగన్వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. చౌడేపల్లె మండలం కాటిపేరి అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని తెలియజేశారు. సోమల మండలం ఫిరంగులగుట్ట మినీ అంగన్వాడీ కార్యకర్త, ముంద్రివారిపల్లెలో ఆయా పోస్టు ఖాళీగా ఉందని వివరించారు.

**పలమనేరు:** పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిదిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో ఇందిరాప్రియదర్శిని కోరారు. పలమనేరు మండలంలోని గొబ్బిళ్లకోటూరులో అంగన్వాడీ వర్కర్ (బీసీ-ఏ), బొమ్మిదొడ్డిలో హెల్పర్(బీసీ-ఏ), పలమనేరు లక్ష్మణ్‌సింగ్‌వీధిలో హెల్పర్(ఓసీ), గంగవరం మండలంలో కేసీపెంటలో మినీవర్కర్(బీసీ-ఎ), తమ్మిరెడ్డిపల్లిలో హెల్పర్ (ఓసీ), మల్లేరులో హెల్పర్ (ఓసీ), జీడిమాకులపల్లిలో హెల్పర్ (బీసీ-ఏ), పెద్దపంజాణి మండలం మద్దలకుంటలో వర్కర్(ఓసీ), శివాడిలో హెల్పర్(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. మరిన్ని వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

**శాంతిపురం:** రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ఖాళీగా ఉన్న 2మినీ అంగన్వాడీ కార్యకర్తలు, 3సహాయకుల పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులు బుధవారం నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చని కుప్పం సీడీపీవో కల్పన తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 19లోపు సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## పుంగనూరు లయన్స్ క్లబ్‌కు 12 అవార్డులు



త్రిమూర్తిరెడ్డికి ప్రశంసాపత్రం, అవార్డును అందజేస్తున్న డాక్టర్ శివ

పుంగనూరు, జూలై 2: పుంగనూరు లయన్స్‌క్లబ్ నోబెల్‌కు 12 అవార్డులు దక్కడం మరవలేనిదని లయన్స్‌క్లబ్ జిల్లా అంబాసిటర్ డాక్టర్ శివ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సరళ నర్సింగ్‌హోమ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్‌క్లబ్ 317 గవర్నర్ రామరాజ్ అరస్ బెంగళూరులో పుంగనూరుకు 12 అవార్డులు అంద జేశారన్నారు. అనంతరం అవార్డులు దక్కిన ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా 2024-25కు పుంగనూరు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా త్రిమూర్తిరెడ్డి, అమరావతి సురేశ్, కోశాధికారిగా కె.రజిఅహ్మద్‌లను కొనసాగిస్తున్నట్లు సభ్యులు ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ముత్యాలు, వరదారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, సురేశ్, రజిఅహ్మద్, మహేంద్రరావు, కేశవరెడ్డి, శ్రీరాములు, ఇనయతుల్లా, షరీఫ్, గోపాలకృష్ణ, సతీశ్, రఘుపతి పాల్గొన్నారు.

## టీడీపీ ఫ్లెక్సీల చించివేత



కుప్పం, జూలై 2: కుప్పంలో చంద్రబాబు రాక సందర్భంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీకి చెందిన ఫ్లెక్సీ లను గుర్తు తెలియని దుండగులు చించి వేశారు. ముఖానికి పసుపు కండువా కట్టుకున్న వ్యక్తి ఒకరు ఫ్లెక్సీలను చించివేయడం సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇది వైసీపీ మూకల పనేనని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఆ దుశ్చర్యకు పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుప్పం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పుంగనూరు రూరల్:** పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీను సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చింపివేసినట్లు టీడీపీ నాయకుడు మధుసూదన్‌రాయల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదనపల్లె రోడ్డులోని పెట్రోల్‌బంక్, పలమనేరు మార్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారని పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

కుప్పం, జూలై 2: కుప్పంలోని కేసీ హాస్పిటల్‌లో మంగళవారం ఆరోగ్యశ్రీ సేవలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేదల ఆరోగ్యంకోసం ఆరోగ్య శ్రీ సేవలను మరిన్ని ఆస్పత్రులకు విస్తరించినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు, ఆస్పత్రి యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## షార్టు సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

పలమనేరు, జూలై2: పలమనేరు డీసీ వీధిలో ఉంటున్న గిరిధర్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మంగళవారం జరిగింది. మంటలు చెలరేగాయి. ఫర్నిచర్, ఇతర సామగ్రి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. అప్పటికే రూ.3.5 లక్షల ఆస్తినష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది నరేష్, పాండియన్, ఆరూర్, భూషణ్‌కుమార్ పాల్గొన్నారు.



## ఆస్పత్రిలో పింఛను అందజేత



రామకుప్పం, జూలై 2: రామకుప్పానికి చెందిన శాంతమ్మ కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న బూత్ ఇన్‌చార్జీలు బాలరాజు, మంజునాథ్‌లు మంగళవారం సచివాలయ ఉద్యోగి బిందువతితో కలిసి ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛను అందించారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



రామకుప్పం, జూలై 2: రామకుప్పం మండలం కెంపసముద్రం ఉన్నతపాఠశాల విద్యార్థులకు మంగళవారం టీడీపీ నేతలు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మాజీ ఉపసర్పంచు గంట్లరెడ్డి, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, హెచ్ఎం నారాయణ, టీడీపీ నాయకులు కోదండరెడ్డి, శంకరప్ప, బ్రహ్మానందం, నవీన్, సతీష్, అవినాశ్, సురేష్, మునిరత్నం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## టార్పాలిన్ పట్టల పంపిణీ

శాంతిపురం, జూలై 2: శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పీఎంఏజేఏవై కింద రైతులకు టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వనాథనాయుడు, ఉదయ్‌కుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, రమేష్, బాలసుబ్రహ్మణ్యం, అనసూయ, శ్యామలమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాల ప్రదానం



గంగవరం, జూలై 2: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. గుండుగల్లు జడ్పీ హైస్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థులు అంజలి, సమిత అనే విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. దీంతో వారికి మొదటి బహుమతిగా రూ.3 వేలు, రెండవ బహుమతిగా రూ.2 వేలు నగదు పురస్కారాలను అదే గ్రామానికి చెందిన టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ జయసింహ ప్రదానం చేశారు. ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి జన్మదినం సందర్భంగా నగదు అందించినట్లు వివరించారు.

## రాహుల్ చిత్రపటాలకు నిప్పు

పుంగనూరు రూరల్, జూలై2: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పార్లమెంటులో హిందూ సమాజానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని పుంగనూరు హిందూ జాగరణసమితి సభ్యులు మండిపడ్డారు. మంగళవారం పుంగనూరులో రాహుల్ గాంధీ చిత్రపటాలను నిప్పుపెట్టి నిరసన తెలిపారు.

## రాహుల్ గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలి



పుంగనూరు, జూలై 2: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు పి.అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో హిందువులను కించపరిచేలా రాహుల్ మాట్లాడడం తగదన్నారు. ● అన్నమయ్య జిల్లా కలికిరిలో మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అయూబ్‌ఖాన్ కలిశారు. పుంగనూరు రాజకీయ పరిస్థితుల గురించి వివరించారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పుంగనూరు, జూలై 2: వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషిచేయాలని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు రాష్ట్ర వాల్మీకిసంఘ నాయకుడు సుకుమార్‌బాబు కోరారు. మంగళవారం కలికిరిలో ఆయన్ను కలిసి సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు.

## తిరుపతికి వెళ్లి పింఛన్ పంపిణీ



పలమనేరు, జూలై2 : పలమనేరు మండలం మండీపేట కోటూరు గ్రామానికి చెందిన చంద్రయ్య అనారోగ్యంతో తిరుపతి బర్డ్స్ ఆస్పత్రిలో కొన్నిరోజులుగా చికిత్స పొందుతున్నారు. దీంతో సచివాలయ సిబ్బంది రఘురామ్ తిరుపతి వెళ్లి రూ.7వేలు పింఛను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య సీఎం చంద్రబాబుకు రఘురాంకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్విమ్స్‌కు వెళ్లి...



స్విమ్స్‌లో పేషెంట్ గంగాధర్‌కు పింఛన్ ఇస్తున్న డిజిటల్ అసిస్టెంట్ క్రాంతి కుమార్

చౌడేపల్లె, జూలై2: వెంగళపల్లికి చెందిన గంగాధర్ డయాలసిస్ పేషెంట్. ఇతడు పెన్షన్ లబ్ధిదారుడు. ప్రస్తుతం స్విమ్స్‌లో చికిత్స పొందు తున్నాడు. విషయం తెలుసుకున్న వెంగళపల్లె డిజిటల్ అసిస్టెంట్ క్రాంతికుమార్ తిరుపతికి వెళ్లి లబ్ధిదారుడికి రూ.10 వేల పింఛన్ పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## అగ్రి, వెటర్నరీ డిప్లొమా కోర్సులతో మెరుగైన ఉపాధి



కాటిపేరి వద్ద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సదుం, జూలై 2: అగ్రి, వెటర్నరీ డిప్లొమా కోర్సులతో మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సదుంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. త్వరగా భవన నిర్మాణం పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నారాయణస్వామి, ఎంపీడీవో రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ యశ్విత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**చౌడేపల్లె:** వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కాటిపేరి వద్ద నిర్మాణంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతగా వేగవంగంగా పనులు చేయాలని ఆదేశించారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ శివప్రసాద్, తహసీల్దార్ శివరాముడు, ఆర్ఐ సుధాకర్‌నాయక్, సర్వేయర్ గుణ పాల్గొన్నారు.

## రైతులకు దారి కల్పించాకే ఫ్యాక్టరీ నిర్మించాలి



పైపుల ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, జూలై2: రైతులు పొలాలకు వెళ్లడానికి దారి సౌకర్యం కల్పించిన తర్వాతే ఆరడిగుంట వద్ద పైపుల ఫ్యాక్టరీ నిర్మాణాలు చేపట్టాలని పుంగనూరు తహసీల్దార్ శివయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని మేలుందొడ్డి, ఆరడిగుంట సమీపంలో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో శ్రీకాళహస్తి సిమెంటు పైపుల ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థలం కేటాయించారు. అప్పట్లో రైతులు ప్రభుత్వ ఒత్తిడి మేరకు భూములు ఇచ్చారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వారికి కేటాయించిన స్థలానికి కంచె ఏర్పాటు చేసింది. అయితే ఇతర రైతులు పండించిన పంటలను రోడ్డు మార్గానికి తీసుకురావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని రైతులు టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తహసీల్దార్ శివయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పొలాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వారికి దారి ఇవ్వాలని ఫ్యాక్టరీ యజమాన్యంతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మేలుందొడ్డి, అమ్మిగానిపల్లె, ఆరడిగుంట, గోపిశెట్టిపల్లె తదితర గ్రామాల రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేఈసీ లియో క్లబ్‌కు 'ఉత్తమ' అవార్డ్



అవార్డు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, జూలై 2: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల లియో ఫ్యూచర్ క్లబ్‌కు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌చే ఉత్తమ లియో క్లబ్ అవార్డ్ లభించింది. బెంగళూరులో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఉత్తమ లియో క్లబ్ ప్రెసిడెంట్ అవార్డును ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధులు బహూకరించారు. కేఈసీ సీఈసీ విభాగం విద్యార్థి వరుణ్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి అవార్డు అందజేసిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అండ్ సీఎస్ఆర్ అంబాసిడర్ కృష్ణారెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ రామరాజ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ ఎ.మహేశ్, కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, సీఈవో సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు మాధవన్, గంగాధరం, పీఆర్వో ప్రవీణ్ కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



బైరెడ్డిపల్లెలో జరిగిన అమర్ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్నకిశోర్‌గౌడు

పలమనేరు, జూలై2 : పలమనేరులో మంగళవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పుట్టినరోజు వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాల యంలో కేక్ కట్‌చేశారు. మధ్యాహ్నం పట్టణం లోని సత్యగంగమ్మ గుడి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ ఆర్బీసీ కుట్టి, నాయకులు ఖాజాపీర్, రూపేష్, క్రిష్ణమూర్తి, చాంద్‌బాషా, చిన్నా, మాబాషా, వెంకటరమణ, పూసల రవి, సుధాకర్, జగన్, పర్వీన్, ప్రమీల, బాలాజీ, మాజీ కౌన్సిలర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

**చౌడేపల్లె:** చౌడేపల్లెలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు గిరిరాజు, బాబు నాయుడు, కుమార్‌రెడ్డి, నాగరాజరెడ్డి, వీకేఆర్ మణిరాజు, విజయభాస్కర్‌రెడ్డి, నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లె నాలుగురోడ్ల కూడలివద్ద టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు. ఇల్లూరు అమరనాథరెడ్డి, గోపినాయుడు పాల్గొన్నారు.

## నైపుణ్యాలు పెంచేందుకే టీచ్‌టూల్ శిక్షణ

పలమనేరు, జూలై2 : బోధనలో వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు టీచ్‌టూల్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పలమనేరులో పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, చౌడేపల్లి, సదుం, సోమల మండలాల్లోని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు టీచ్‌టూల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, పలమనేరు ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, ఎస్ఆర్పీలు నాగేంద్ర, ప్రేమసాగర్, మాస్టర్ ట్రయినర్లు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ

పలమనేరు, జూలై2 : పలమనేరులో అర్బన్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో డెంగ్యూ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ మాట్లాడుతూ ఈ నెల 1నుంచి 31వ తేదీ వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి దోమల నిర్మూలనపై ప్రజలకు వివరిస్తారన్నారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు ఉషాకుమారి, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల వితరణ

పుంగనూరు రూరల్, జూలై2: పుంగనూరు పట్టణం, మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను పుంగనూరు టీడీపీ నేత, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సన్మానం

కుప్పం, జూలై 2: ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాల విద్యార్థులను మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన లలితారాణి, తబసం, సుస్మిత, పూజలు సన్మానం అందుకున్నవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, సీనియర్ అధ్యాపకులు జగదీశ్‌బాబు, వాసు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం/ శాంతిపురం, జూలై 2: ముఖ్యమంత్రి చంద్రబాబు తన నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చినట్లే సొంత నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఒక్కొక్కటిగా చేయడానికి సిద్ధమవుతున్నారు. వ్యవసాయదారులకు సాయం అందించడానికి కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం కోసం అన్వేషణ చేస్తున్నారు. శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ తంబిగానిపల్లె రెవెన్యూ సర్వే నెంబరు 66 శత్తగుట్టలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా, స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి మంగళవారం స్థల పరిశీలన జరిపారు. ఇక్కడ 132 ఎకరాల భూమిని సేకరించడానికి ప్రయత్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటైతే నియోజకవర్గ రైతులకు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులలో శిక్షణ ఇచ్చి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విషయంలో ప్రభుత్వం సాయం చేస్తుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నాయకులు ఉదయ్‌కుమార్, విజయరామిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

## మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కల్లూరు, జూలై 2: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మదాలి, పాఠశాల హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని, పచ్చదనాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్‌కోర్, లయన్స్ క్లబ్ సభ్యులు వెంకట సిద్ధులు, రాజేంద్ర, ప్రకాష్, ఉపాధ్యాయులు చలపతి, సుభాషిణి, విమల, చాముండేశ్వరి, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలు, పండ్లు పంపిణీ



**వి.కోట, జూలై2:** ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పుట్టినరోజు వేడుకలను టీడీపీ నాయకులు వీకోటలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీయార్ కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, నేతలు ఎస్కే ఇక్బాల్, సుబ్బన్న, రాంబాబు, గోపీనాథ్, ధీరజ్, శబరీష్, ఈశ్వర్, సోము, హరి, నారాయణస్వామి, నాసిర్, నాగభూషణం, చంద్రారెడ్డి, విశ్వనాథ్, జనార్ధనరెడ్డి, కోదండ పాల్గొన్నారు.

**పెద్దపంజాణి:** పెద్దపంజాణిలో టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. నాయకులు ఆనంద, మురహరిరెడ్డి, రోజారెడ్డి, సుధాకరరెడ్డి, శ్రీరాములు, నాగరాజ, ముబారక్‌తాజ్, వేణుగోపాల్ నాయుడు, క్రిష్ణారెడ్డి, సుబ్రమణ్యం, రెడ్డెప్ప, శంకర, పాల్గొన్నారు.

## టీడీపీ జెండా ఆవిష్కరణ పనులు పరిశీలన

చౌడేపల్లె, జూలై2: టీడీపీ జెండా స్థాపన కోసం జరుగుతున్న నిర్మాణ పనులను ఆ పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం టీడీపీ జెండాను దౌర్జన్యంగా తొలగించిందన్నారు. ఈ నెల 5న మంత్రి రాంప్రసాద్‌రెడ్డిచే జెండా ఆవిష్కరణ జరగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిరాజు, కళ్యాణ, పరమేశం పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడు మృతి

చౌడేపల్లె, జూలై2: టీడీపీ సీనియర్ నాయకులు వెంకటరమణ(65) మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహానికి టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన వల్లిగట్ల వాసి

సోమల, జూలై 2: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును సోమల మండలం వల్లిగట్ల వాసి, ఆయన అభిమాని కేకదిరప్ప మంగళవారం న్యూ ఢిల్లీలో కలిసి శాలువతో సత్కరించారు.

## అతిసార నివారణపై అవగాహన ర్యాలీ

సోమల, జూలై 2: పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మంగళ వారం అతిసార నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ టీవీలతో బోధనలు

సోమల, జూలై 2: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్మార్ట్ టీవీలతో బోధనలు సాగిస్తున్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశాలు ప్రదర్శించారు. ఎంఈవో శివరత్న స్మార్ట్ టీవీ బోధనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆగిఉన్న లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

పలమనేరు, జూలై2 : పలమనేరు-కుప్పం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ద్విచక్ర వాహనదారుడు మృతిచెందారు. పలమనేరు మండలం దిగువకల్లాడుకు చెందిన సోమరామిరెడ్డి(65) సోమవారం రాత్రి బైరెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తూ సాకేఊరు వద్ద ఆగిఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయ పడిన సోమరామిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**పుంగనూరు రూరల్, జూలై2:** పలమనేరు టీడీపీ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన స్థానిక దోబీ కాలనీలోని వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు మధుసూదన్‌రాయల్, అనిల్‌రాయల్, శివాడి జ్ఞానేంద్ర, సంపల్లె మోహన్‌రెడ్డి, ఆసీన్‌బాషా, జగదీశ్‌రాయల్, కిరణ్‌రాయల్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

**గంగవరం:** గంగవరం పోలీసుస్టేషన్ సర్కిల్ వద్ద టీడీపీ నాయకులు, అమర్ అభిమానులు కేక్ కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, టెక్స్‌మో బాబునాయుడు, ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, అమర్‌నాథరెడ్డి, ప్రసాద్‌నాయుడు, హరిబాబు, మురళి, సతీష్‌నాయుడు, యుగంధర్, గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.



గంగవరంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

## విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఏవీఎస్ నూతన కార్యవర్గం

చిత్తూరు (సెంట్రల్), జూలై 2: విద్యారంగంలోని సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఆంధ్ర విద్యార్థి సంఘం పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కొంగారెడ్డిపల్లిలోని ఏవీఎస్ కళాశాల కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడుతో పాటు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి అఖిల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడుగా పవన్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పునీత్, చిత్తూరు నియోజకవర్గ కన్వీనర్‌గా చరణ్‌తేజ్, నగర అధ్యక్షుడుగా ధనుష్, కార్యదర్శిగా లక్ష్మణ్, మీడియా కన్వీనర్‌గా జ్యోతీష్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రోడ్లపై మురుగు పారితే చర్యలు తప్పవు



స్థానికులతో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ

చిత్తూరు (సెంట్రల్), జూలై 2: రోడ్లపై మురుగు పారితే చర్యలు తప్పవని మున్సిపల్ ఎంహెచ్‌ఓ అనిల్ కుమార్ నాయక్ హెచ్చరించారు. నగరంలోని టెలిఫోన్ కాలనీలో ఐదు నెలల కాలంగా రోడ్లపై పారుతున్న మురుగు సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. ఇక్కడి రోడ్డు 40 అడుగులు వెడల్పు ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నా, ప్రస్తుతం అంత లేకపోవడంపై ఆరా తీశారు. మురుగు కాలువల నిర్మాణాలకు స్థలం తేకుండా చేయడంపై అక్కడి గృహ యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. త్వరలో కాలువ నిర్మాణాల విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లానన్నారు. టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ షణ్ముగం, నబీబాషా, బాలకృష్ణ, మహిళలు ఉన్నారు.

## సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



గంగాధరనెల్లూరు, జూలై 2: నెల్లేపల్లె పంచాయతీలో జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ స్థానిక నేతలతో కలిసి మంగళవారం లబ్ధిదారులకు పింఛన్‌లను పంపిణీ చేశారు.. నందనూరు పంచాయతీ ఎగువకాల్వలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సురేంద్రకుమార్ పార్టీ నేతలు, పింఛన్‌ల బ్ధిదారులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికిపాలాభిషేకం చేశారు. టీడీపీ నేతలు రాజమాణిక్యం, నారాయణస్వామి పాల్గొన్నారు.

## రోగులకు గల్ల పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, జూలై 2: పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ఓపీ రోగుల్లో 10 శాతం మందికి తప్పని సరిగా గల్ల పరీక్షలు నిర్వహించాలని జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ ల్యాబ్ టెక్నీషియన్లను ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారికి కూడా గల్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. స్పర్శ లేని మచ్చలు, అనుమానిత కేసులను వైద్యాధికారి దృష్టికి తీసుకొచ్చి మందులు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డీఎంవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అతిసారపై గ్రామాల్లో అవగాహన



అతిసారపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

విజయపురం, జూలై 2: మండలంలో వైద్య సిబ్బంది మంగళవారం డయేరియాపై అవగాహన నిర్వహించారు. అతిసార వ్యాధి నుండి పిల్లలను రక్షించడంపై అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలి నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన చేయకూడదని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించాలని వైద్యాధికారి సోమశేఖర్ సూచించారు. వైద్యాధికారి విష్ణుప్రియ, ఎంఈవో హరి ప్రసాద్‌వర్మ, ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు



గుడిపాల, జూలై 2: నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్లు నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిరంతరం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు కేపీ ప్రసాద్, సుధాకర్ యాదవ్, దొరబాబు, గాంధీ, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారమే వడ్డించండి: డీఈవో



ఉపాధ్యాయులతో డీఈవో దేవరాజన్

గుడిపాల, జూలై 2: విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించి, వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని డీఈవో దేవరాజన్ అన్నారు. మంగళవారం మండలంలోని నరహరిపేట జడ్పీహైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన స్కూల్ బ్యాగులను పరిశీలించారు. ఎంఈవోలు రామ్ నాయక్, గణపతి, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌ను పరిశీలించన జడ్పీ సీఈవో

కార్వేటినగరం, జూలై 2: స్థానిక డంపింగ్ యార్డ్‌ను జడ్పీ సీఈవో గ్లోరియా మంగళవారం పరిశీలించారు. డంపింగ్ యార్డ్ అభివృద్ధి గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీపీఆర్సీ కోఆర్డినేటర్ షణ్ముగం, ఎంపీడీవో సీజన్‌నాయుడు, గ్రామ పంచాయతీ ఈవో మణి పాల్గొన్నారు.



# చిత్తూరు
## జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

## నేటి నుంచి ఐటిఐ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరణ

చిత్తూరు రూరల్, జూలై 2: రూరల్ మండలంలోని బీఎస్‌ఆర్ పేట ఐటిఐలోని వివిధ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ నెల 3 నుంచి దరఖాస్తులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేది లోపు జ్జీజ్జీఇఃజౌ.జీ ..వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 27న ఇంటర్వ్యూలో హాజరుకావాలన్నారు. సీవోపీఏ, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటార్ వెహికల్, డీ-మ్యాన్ సివిల్ కోర్సులు ఉన్నాయన్నారు.

## డీఎంపురంలో వైభవంగా గంగమ్మ జాతర

కార్వేటినగరం, జూలై 2: డీఎంపురం దళితవాడలో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గోవిందరాజులు ఆధ్వర్యంలో జాతర జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

## ఎర్రచందనం దుంగల స్వాధీనం



నింద్ర, జూలై 2: కొప్పేడు-కావనూరు మార్గం పెద్ద పట్టెడ వద్ద వాహనాన్ని ఛేదించి ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు నింద్ర ఎస్‌ఐ రామచంద్రయ్య తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వాహనాల తనిఖీలో భాగంగా ఎర్రచంద్రనం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు వెంబడించారు. పంటపొలాల వద్ద వాహనం వదలి నిందితులు పరారయ్యారు. వాహనంలో 50 దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఎర్రచందనం దుంగలు సుమారు 500 కేజీలు ఉంటాయని, వాహనంతో సహా వాటి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. పరారీలో ఉన్న నింధితుల కోసం ప్రత్యేక బృందం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## పించన్ల పంపిణీలో మూడవ స్థానం

కార్వేటినగరం, జూలై 2 పించన్ల పంపిణీలో కార్వేటినగరం మండలం జిల్లాలో మూడోస్థానంలో నిలిచిందని ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండలానికి 7145 మందికి పించన్లు మంజూరు కాగా వీరిలో 7090 మందికి పంపిణీ చేసి జిల్లాలోని మూడు స్థానం నిలిచినట్లు పేర్కొన్నారు.

## ఆలయానికి వెండి వస్తువుల వితరణ

కార్వేటినగరం, జూలై 2: శ్రీ సుబ్రమణ్వేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజోత్సవాలు ,అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పించిపెట్టారు. స్థానికంగా ఇద్దరు భక్తులు పదివేల రూపాయలు విలువ చేసే వెండి వస్తువులను ఆలయానికి బహూకరించారు. అమ్మవారికి వెండి మంగళసూత్రం, స్వామివారికి శూలం, జెండా కోడి వస్తువులను అందజేశారు.

## మంత్రి లోకేష్‌ని కలిసిన నాగేశ్వరరావు



కార్వేటినగరం, జూలై 2: మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్‌ను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధికారిక మాస పత్రిక ఎడిటర్ గాజుల నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. ఆయనకు అభినందనలు తెలిపారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కను నాటుతున్న శేషాద్రికుమార్

వెదురుకుప్పం, జూలై 2: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్ అన్నారు. మంగళవారం దిగువపల్లాలు, అళ్లమడుగు గ్రామ పంచాయతీల్లో పలుచోట్ల బీజేపీ శ్రేణులతో కలసి మొక్కలను నాటారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కె.విశ్వనాథరెడ్డి, బోడిరెడ్డి గుణశేఖర్ టీం పాల్గొన్నారు.

## డీజేని కలిసిన కలెక్టర్ సుమిత్



చిత్తూరు లీగల్, జూలై 2: జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావును కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం సాయంత్రం కోర్టు భవనంలోని డీజే చాంబర్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.. ఇద్దరూ కలిసి కొత్త చట్టాలపై కొంతసేపు చర్చించుకున్నారు.

## రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి: టీడీపీ

వెదురుకుప్పం, జూలై 2: పించన్ల సొమ్మును పెంచి ఒకటో తేదినే వలంటీర్లు లేకుండా చేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి నేసనూరు మునిచంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు చెంగల్రాయరెడ్డి అన్నారు. మంగళవారం వెదురుకుప్పంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇక సంక్షేమం, అభివృద్ధి జతగా కొనసాగుతాయన్నారు. పించన్ల పండుగతో పల్లెల్లో అవ్వతాతలు, ప్రత్యేక ప్రతిభావంతుల కళ్లలో ఆనందం కనిపించిందన్నారు. చంద్రబాబు అంటే సంక్షేమం, జగన్ అంటే సంక్షోభమని వారు పేర్కొన్నారు.

# పతనమవుతున్న మామాడి ధరలతో దిగాలు

### ●తోతాపురి టన్ను రూ.18 వేలు



మండీలో తోతాపురిని చూపుతున్న వ్యాపారస్థుడు

బంగారుపాళ్యం, జూలై 2: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రోజురోజుకూ మామిడి ధరలు పతనమవుతున్నాయి. గుజ్జు పరిశ్రమకు తరలించే మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని గగ్గోలు పెడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు,వ్యాపారస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌లో తోతాపురి రకం టన్ను రూ.18 వేలు ధర పలికింది. 20 రోజుల క్రితం రూ.28 వేలు పలికింది. ఆ మరుసటి రోజు నుంచి రోజురోజుకూ ధర పతనమవుతోంది. పలమనేరు మండలం రంగినాయనిపల్లికి చెందిన వ్యాపారస్థుడు మాట్లాడుతూ ఈ ఏడాది రూ.80 లక్షలు వెచ్చించి తోపులు కొన్నామన్నారు. తోపులపైనే కేజీ రూ.25 చొప్పున కొనుగోలు చేశామన్నారు. ధరలు పతనమౌతూవుండడంతో రూ.80 లక్షల పెట్టుబడికి గాను రూ.25 లక్షలు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

> **పెట్టుబడి కూడా రాలేదు**
>
> 30 ఎకరాల మామిడి తోట ఉంది. ధర పెరుగుతుందని కాయలు కోయలేదు. మంగళవారం మార్కెట్‌కు 10 టన్నులు తరలించాను. టన్ను రూ.18వేలు పలికింది. పెట్టుబడి కూడా రాలేదు. అప్పులు తీర్చలేని పరిస్థితి ఏర్పడింది.
>
> **మురుగన్, రైతు,వెలుతురుచేను**

## గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు అధిక వడ్డీలు



ఖాతాదారులకు ఏటీఎం కార్డులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ రజనీకాంత్

గుడిపాల, జూలై 2: సప్తగిరి గ్రామీణ బ్యాంకు అత్యధిక వడ్డీ ఇస్తోందని ఆ బ్యాంకు గుడిపాల బ్రాంచి మేనేజరు రజనీకాంత్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ బ్యాంకులో మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఏటీఎం కార్డులు, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఫోన్ పే, గూగుల్ పే తదితర యూపీఐ సేవలు ఉన్నాయన్నారు. సీనియర్ సిటిజన్లు బ్యాంకులో డిపాజిట్ చేస్తే సంవత్సరానికి 8.25శాతం, ఇతరులకు 7.75శాతం వడ్డీ ఇస్తున్న ఏకైక బ్యాంకు అన్నారు. ఖాతాదారులకు ఏటీఎం కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు గిరిబాబు, భవాని, శ్రీకావ్య, రాజు, వంశీ పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీని తనిఖీ చేసిన జేసీ



చిత్తూరు కలెక్టరేట్, జూలై 2: నగరపరిధిలోని గంగనపల్లిలో రేషన్ పంపిణీని జేసీ శ్రీనివాసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొబైల్ వాహనం ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న ఉచిత బియ్యం నాణ్యత, వాహనదారుడు ఇస్తున్న పరిమాణాలపై కార్డుదారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన రీతిలో నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని, తూకాల్లో తేడాలొస్తే వేటు తప్పదని వాహనదారులను హెచ్చరించారు. డీఎస్వో శంకరన్, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్, తహశీల్దార్ శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అప్పు తిరిగి చెల్లించమంటే దాడులకు తెగబడుతున్నారు



రాజశేఖర్

చిత్తూరు సిటీ, జూలై 2: స్నేహితుడే శత్రువై ప్రాణం తీయాలని చూస్తున్నాడని ఎస్‌ఆర్‌పురం మండలం మెదవాడకు చెందిన రాజశేఖర్ ఆరోపించారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో అతను మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన జ్యోతి ప్రకాష్ తాను స్నేహితులమన్నారు. తాను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, జ్యోతి ప్రకాష్‌కు ఉద్యోగం రాలేదన్నారు. షామియానా, సప్లయర్స్ దుకాణం పెట్టుకోవాలని అడిగితే రూ.9.20 లక్షలు ఇచ్చానని చెప్పారు. ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమంటూ జ్యోతీశ్వర్, కుటుంబ సభ్యులు విశ్వనాథం నాయుడు, సోమశేఖర్ నాయుడు, డిల్లీబాబులతో కలసి పలుమార్లు తనపై భౌతిక దాడిచేశారని ఆరోపించారు. పలుమార్లు హత్యాప్రయత్నం చేశారన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఎస్పీ స్పందించి రక్షణ కల్పించాలని రాజశేఖర్ కోరాడు.

## మజ్దూర్ కార్మికుల వేతనాలు 5శాతం పెంపు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, జూలై 2: అసంఘటిత మజ్దూర్ కార్మికుల వేతనాలు గత ఏడాదికంటే ఐదు శాతం పెంచుతూ జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పుల్లయ్య అధ్యక్షతన ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. డీఆర్వో మాట్లాడుతూ పెంచిన వేతనాలు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం లేని కార్మికులకు రోజుకు రూ.538, మున్సిపాలిటీల్లో రూ.621, కార్పొరేషన్లలో రూ.678 చెల్లించాలన్నారు. అర్ధ నైపుణ్యం ఉన్నవారికి రూ.565, రూ.652, రూ.712 చెల్లిస్తారని, పూర్తి నైపుణ్యం వున్న కార్మికులకు వరుసగా రూ.594, రూ.685, రూ.749గా వేతనం పెంచినట్లు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, జిల్లా కార్మికశాఖ అధికారి కె. ఓంకార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ అసిస్టెంట్ ఈవో రవి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా గంగమ్మ జాతర మహోత్సవం

చిత్తూరు కల్చరల్, జూలై2: నగరంలోని ఎల్ బి పురం హరిజనవాడలో మంగళవారం నడి వీధి గంగమ్మజాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశేష అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్థానికులు, యూత్ సంఘం ప్రతినిధులు అంబలి, కుంభ నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని మేళతాళలతో ఊరేగించారు. పరిసర మండలాల నుంచి వచ్చిన భక్తులకు యూత్ సంఘం నాయకులు అన్నదానం చేశారు. బుధవారం అమ్మవారికి జలాభిషేకం నిర్వహించనున్నారు.

## గుండ్రాజుకుప్పం దళితవాడలో భానుప్రకాష్ పర్యటన



వధూవరులతో భానుప్రకాష్

నగరి జూలై2: గుండ్రాజుకుప్పం దళితవాడలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. కాబోయే వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ జయపాల్ అలెక్స్, మండల మహిళా కార్యదర్శి శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

## స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పాలసముద్రం, జూలై 2: స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ మోహన్‌క్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 3 వరకు ప్రతి గ్రామంలో స్టాప్ డయేరియా కార్యక్రమాలను ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఓఆర్‌ఎస్, జింక్ ప్యాకెట్లను సకాలంలో అందిస్తే డయేరియాను అరికట్టవచ్చన్నారు.

## రుయాకు వెళ్లి పింఛను అందజేత



పింఛను అందిస్తున్న మాంబేడు డీడీవో

వెదురుకుప్పం, జూలై 2: రుయాలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ వికలాంగురాలికి పింఛను సొమ్మును మంగళవారం మాంబేడు గ్రామ సచివాలయ డీడీవో తోట సుబ్రహ్మణ్యం, మహిళా సంరక్షణ కార్యదర్శి శిరీష అందజేశారు. దాంట్లవారి ఇండ్లుకు చెందిన కె.ఇరగమ్మ రుయాలో చికిత్స పొందుతున్న సమాచారం తెలుసుకుని మంగళవారం అక్కడికి వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. అన్నారు. మంగళవారం వెదురుకుప్పం మండలం అగ్రహారంలో లబ్ధిదారులకు టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు గాలి బాబునాయుడు పింఛన్ల సొమ్మును అందించారు. జిల్లా క్రిస్టియన్ సెల్ ప్రధానకార్యదర్శి రజనీకాంత్, నాయకులు విక్రమ్‌రెడ్డి, డి.బాబునాయుడు ఉన్నారు.

## 'చంద్రబాబుకు రుణపడి ఉంటా'



సాయి

విజయపురం, జూలై 2: ప్రాణం ఉన్నంత వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విశ్వాసంగా ఉంటానని ఇళ్ళత్తూరుకు చెందిన దివ్యాంగుడు కన్నీటి పర్వతం అయ్యాడు. మంగళవారం దివ్యాంగ పింఛను తీసుకోవడంతో ఎంతో ఆనందం వ్యక్తంచేశాడు. సాయి కుటుంబంలో తండ్రి పార్థసారథి, తల్లి దేవా, చెల్లెలు సారిక ఉన్నారు. వీరు కూలీ పనులు చేసి జీవనం సాగిస్తున్నారు. సాయి మూడు చక్రాలకు పరిమితం కావడంతో కుటుంబం అవస్థలు పడుతోంది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా పింఛను పెంచడంతో కుటుంబాన్ని సులభంగా పోషించుకోవచ్చని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## బాల్యం నుంచే విలువతో కూడిన విద్య నేర్పించాలి

చిత్తూరు కల్చరల్, జూలై2: చిన్ననాటి నుంచే ఉన్నత విలువలతో కూడిన విద్య అవసరమని ఆధ్యాత్మిక సలహాదారుడు రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం సంతపేటలో జరిగిని సత్యసాయి బాలవికాష్ సదస్సులో ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఆధ్యాత్మికతతో కూడిన సంస్కార విద్యలు బోధించాలన్నారు. అనంతరం చిన్నారులకు నీతి కథలు, శ్లోకాలు, చిత్ర లేఖనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయిసేవాసమితి జిల్లా అధ్యక్షులు యస్. మధుసూదనం, నగర కన్వీనర్ పి. శేషనారాయణ, వసంత పాల్గొన్నారు.

## పశువైద్యశిబిరంలో ఉచితసేవలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీడీ గోవిందయ్య

పాలసముద్రం, జూలై 2: సింహరాజుపురంలో మంగళవారం ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని డీడీ డాక్టర్ గోవిందయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పశువుల చర్మంలో పిడుదుల వ్యాధి నివారణకు బూటాక్స్ మందులను స్ప్రే చేయించారు.

## డెంగ్యూ నివారణకు చర్యలు

నగరి జూలై2: డెంగ్యూ నివారణకు చర్యలు చేపట్టాలని మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి ఆదేశించారు. మంగళవారం తమ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. .డెంగ్యూ అనుమానిత కేసుల శాంపిల్స్ సేకరించి వైద్యశాలకు పంపాలన్నారు. .ప్రభుత్వ ఆసుపత్రులతోనే ఎలీసా టెస్టులు చేయించాలన్నారు.

## గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి

శ్రీరంగరాజపురం, జూలై 2: గ్రీన్ అంబాసిడర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య కోరారు. మంగళవారు పుల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలో మండల గ్రీన్ అంబాసిడర్ మండల అధ్యక్షుడు చంద్రబాబు అధ్యక్షతనలో జనరల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్ల జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, మండల నాయకులు హేమాద్రి, ఆర్పోదం, మునయ్య, యేసు, కార్మికులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు

గంగాధరనెల్లూరు, జూలై 2: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెనుమూరు మండలంలోని చిన్నకలికిరి అంగన్‌వాడీ వర్కర్ (బీసీ - ఎ), పొళ్ళం యానాది కాలనీలో మినీ అంగన్‌వాడీ వర్కర్ (ఎస్.టీ.), పుట్టగానిపల్లె మిని అంగన్‌వాడీ వర్కర్ పోస్ట్ (ఓసీ), కె. గొల్లపల్లె అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ), గంగాధరనెల్లూరు మండలంలోని కలిజవేడు అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ), అగరమంగళం అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్సీ), కె. వెంకటాపురం దళితవాడలో అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్సీ), కోటాగరం దళితవాడలో అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్సీ), తూగుండ్రం పంచాయతీ దాసరపల్లె అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ), తిరువీధికుప్పం అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ) పోస్టులకు అర్హులైన అభ్యర్థినులు ఈనెల 19 సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**విజయపురం** : అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న సీడీపీవో కృష్ణవేణి పేర్కొన్నారు. ఎల్లసముద్రంలో మినీ అంగన్‌వాడీ, శ్రీహరిపురంలో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈ రెండూ బీసీ-డీకి రిజర్వు చేసినట్టు తెలిపారు. నింద్ర మండలంలో కీశంబాకం దళితవాడలో మినీ అంగన్‌వాడీ ఓసీ, శ్రీరామాపురం ఎస్టీ కాలనీలో మినీ అంగన్‌వాడీ ఎస్టీ ,కొప్పేడు దళితవాడలో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్ట్ ఎస్సీకి, పాదిరిలో జనరల్ కేటగికి రిజర్వు చేసినట్టు తెలిపారు. నగరి మున్సిపాలిటీ టీఆర్ కండ్రిగలో ఓసీకి, సత్రవాడలో బీసీ-బీకి రిజర్వు చేశారన్నారు. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జెరాక్స సర్టిఫికెట్లను 19వ తేదీ సాయంత్రంలోగా నగరి ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.